# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు విజయదశమి, గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ దారులకు కరువు భత్యాన్ని 3 శాతం పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో జరిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (RSS) శతాబ్ధి ఉత్సవాల్లో పాల్గొన్నారు.
- ❖ ఆర్బీఐ 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలను 6.5 నుంచి 6.8 శాతానికి సవరించింది.
- ❖ జీఎస్టీ పన్నుల తగ్గింపు రక్షణ రంగంలో కొనుగోళ్లపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

==============================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు విజయదశమి, గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా పౌరులందరి తరపున ఆయనకు నివాళులు అర్పిస్తున్నానని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. శాంతి, సహనం, సత్యం అనే గాంధీజీ ఇచ్చిన సందేశం మొత్తం మానవాళికి ప్రేరణ అని అన్నారు. అంటరానితనం, నిరక్షరాస్యత ఇతర సామాజిక దురాచారాలను నిర్మూలించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని రాష్ట్రపతి ఆ సందేశంలో పేర్కొన్నారు.

==============================

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ దారులకు కరువు భత్యం (D.A.)ను మూడు శాతం పెంచేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పెంపుదల ఈ ఏడాది జులై 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

అధ్యక్షతన ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయాలను పాత్రికేయులకు వెల్లడించారు. కరువు భత్యం పెంపుతో సుమారు 49.2 లక్షల మంది ఉద్యోగులు, 68.7 లక్షల మంది పెన్షనర్లు లబ్ది పొందుతారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అదే విధంగా పప్పు ధాన్యాల దేశీయ ఉత్పత్తిని పెంచడానికి "మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్" కు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

రబీ మార్కెటింగ్ సీజన్ 2026-27 కోసం తప్పనిసరి పంటలన్నింటి కనీస మద్దతు ధరలను పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. గోధుమ, శనగ, పెసర పప్పు, ఆవాలు, సన్ ఫ్లవర్ మద్దతు ధరలను పెంచగా ఇందులో అత్యధికంగా క్వింటాల్ సన్ ఫ్లవర్ కు 600 రూపాయలు, పెసరకు 300 రూపాయలకు పెంచిందని అశ్విని వైష్ణవ్ తెలియజేశారు.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (RSS) శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా RSS దేశానికి చేసిన కృషికి గుర్తింపుగా ప్రత్యేకంగా రూపొందించిన స్మారక తపాలా బిళ్ళను, నాణేన్ని ప్రధానమంత్రి విడుదల చేశారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ.. RSS జాతి నిర్మాణం కోసం పని చేస్తోందని, ఈ సంస్థలోని స్వచ్ఛంద సేవకులు పలు సంక్షోభ సమయాల్లో వివిధ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ తో పాటూ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా పాల్గొన్నారు.

==============================

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలను 6.5 నుంచి 6.8 శాతానికి సవరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం 2.6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈరోజు ముంబైలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాల్గవ ద్వైమాసిక విధానాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనుకూల పరిస్థితులు, తక్కువ ద్రవ్యోల్బణం, ద్రవ్య సడలింపుల ద్వారా ఆర్థిక వృద్ధి అంచనా స్థిరంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశీయ ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్నాయని తెలిపారు. ఇక ఆర్‌బిఐ తన రెపో రేటును 5.5 శాతంగానే కొనసాగించాలని నిర్ణయించిందని సంజయ్ మల్హోత్రా వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==============================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా జీ20 సదస్సుని భారత్ విజయవంతంగా నిర్వహించడంపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 118 సెకన్లు)

==============================

జీఎస్టీ పన్నుల తగ్గింపు రక్షణ రంగంలో కొనుగోళ్లపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 2025 రక్షణ ఖాతా విభాగ దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జీఎస్టీ పన్నుల హేతుబద్ధీకరణను ఆయన ఒక ప్రగతిశీల దశగా అభివర్ణించారు. దేశ రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధి ఆధారిత సాంకేతికతలను ప్రోత్సహించేందుకు ఒక సృజనాత్మక ఎకో సిస్టం అవసరమన్నారు. రక్షణ రంగం బడ్జెట్ సంరక్షకుడిగా అకౌంట్స్ విభాగం, పరిశోధనలను సులభతరం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో రక్షణ రంగంలో మరిన్ని కొనుగోళ్లు సాధ్యమవుతాయని రాజ్‌నాథ్ సింగ్ విశ్వాసం వ్యక్తం చేస్తూ…

(వాయిస్ 22 సెకన్లు)

==============================

ఈశాన్య భారతదేశంలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. అదే విధంగా ఛత్తీస్‌గఢ్, కోస్తాంధ్ర, సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలతో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 80 వేల 267 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 716 పాయింట్ల లాభంతో 80 వేల 983 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225 పాయింట్ల లాభంతో 24 వేల 836 వద్ద ముగిసింది.

==============================

==============================